# గింజలు మిగిలాయి!

దాలయ్య ఫాక్టరీ నించి వొచ్చి, తీనెమీద కూచున్నాడు. పక్కింటి ముసలమ్మ తాళాలు తీసుకొచ్చి ఇచ్చింది, ఇతను రావడం పసిగట్టి.

"అదేదీ?" అన్నాడు దాలయ్య.

"ఏమో, నాతో సెప్పింది కాదు" అంది ముసలమ్మ.

దాలయ్య తలుపు తీసుకొని, బుడ్డి వెలిగించాడు. ఆ మినుకు మినుకు మనే దీపం సాధ్యమైనంత వరకూ చీకటిని తరిమి వేస్తోంది. వస్తువులన్నీ ఎక్కడి వక్కడే వున్నాయి. అదేమైందో తెలీదు. ఎవ్వరితోనూ చెప్పనట్టుంది. అదే వొస్తుందనే నమ్మకంతో దాలయ్య తన పనులన్నీ చేసుకుంటున్నాడు. దూరంగా బారెడు మేరలో వున్న ఒరల నుయ్యికి చాద తీసుకుని బయలు దేరాడు.

చన్నీళ్ళ స్నానం, పొద్దున్న నించీ, ఎంతో శ్రమపడ్డ అతనికి కొంత మనశ్శాంతి నిస్తోంది. అంతసేపూ ఏవో ఆలోచనలు మెదడులో పరుగెడుతున్నాయి 'ఎప్పుడు ఇట్లా చేసేది కాదు. ఈ వేళ ఏమొచ్చిందని? ఎవరన్నా చుట్టాలూ పక్కాలూ వున్నారేమో అదీ కనపడదు.

పోనీ స్నేహాలు... అవి అసలే లేవు. ఎవళ్ళతోనూ పదినిమిషాలకంటె ఎక్కువసేపు మాట్లాడది కాదు. ఏమన్నా అంటే తను, "వొట్టి సొద! ప్రతోళ్ళతోనూ మాటాడ్డానికి ఏటుంది?" అనేది.

ఆకలి తీర్చుకుందుకు దాలయ్య ముంతలు వెదుకుతున్నాడు. కాస్త గంజి, వరి అన్నం వుంది ఓ మూల తనొక్కడికే సరిపోయేంత

'అదేమౌతుంది? తిండికూడా తినదేటి?' అనుకున్నాడు. మాడుతూన్న కడుపు మళ్ళీ ఆ మాట జ్ఞాపకానికి రాకండా చేసింది. అంచేత తనకి కావాల్సిందంతా తడుము కోకండా తినేశాడు.

ముంతలు మామూలుచోటుంచి వీధిలో నులకమంచం వేశాడు, గుడిసె కెదురుగా.

తక్కిన గుడిసెల్లో మనుషులు తమ తమ సొంత గొడవల్లో పడున్నారు. కొందరు అలసిపోయిన తమ భర్తలకి సేదదీరుస్తున్నారు. కొంతమంది తమ పిల్లలకి అన్నం తినిపిస్తున్నారు. మరికొందరు, కిరసనాలు కరువు వల్ల ముందరగానే అన్నాలు తిని - వీధిలో వేసవి కాలపు రాత్రి చల్లని గాలికి చేరారు.

దాలయ్య రావడం చూసిన కొందరు, తీరుబడి వున్న వాళ్ళు, అక్కడి కొస్తున్నారు. దాలయ్యకి ఎందుకో మొదట అర్థంకాలేదు. కాని క్రమంగా వాళ్ల మాటలు తను – ఫాక్టరీలో వుండగా జరిగిన సంఘటనని తెలీచేస్తున్నాయి.

"దానింట వాన గురవ! పాపం, నిన్నిట్టా జేసి..."

ఓ ములసమ్మి పరామర్శ చేస్తోంది. ఆమె వెనకాలే ముసి ముసి నవ్వులు నవ్వుతోన్న పడుచులు – 'అది గనక అంత నీచ కార్యం చేసింది; మేమెంత మంచి వాళ్ళమో చూసుకో!' అన్నట్టు చూస్తున్నారు.

ఈపాటికి దాలయ్యకి అదేమైందో అర్థమైంది. పరామర్శ అవగానే వొచ్చిన వాళ్ళు మెల్లిగా జారుతున్నారు.

దాలయ్య ఆలోచనలో పడ్డాడు. తనేం లోటు చేశాడని? దాని కోసరమే కదా ఇంత చెమటోడుస్తుంట. పోనీ ఇష్టం లేదని ఏ క్షణంలోనన్నా చెప్పలేదే. అనుమానానికైనా తావివ్వలేదు, ఈ ఎనిమిదేళ్ల స్నేహంలోనూ చివరికి వెళ్ళేటప్పుడు కూడా, తను ఏం కష్టపడతాడోనని, గంజికాచి, తాళాలు ఎవరికో యిచ్చి వెళ్ళి పోయింది. నిజంగా యిష్టం లేని వాళ్లెవరేనా ఇట్లా చేస్తారా? ఇష్టం లేదని, ముక్కలకింద కోసినా, అనుకోగలగడం అసంభవం.

మరి, ఎందుకు లేచిపోయింది? దానికే, ఎంత ఆలోచించినా సమాధానం రావడం లేదు.

తనకంటె ఆకర్షవంతమైన, ఎక్కువ సౌఖ్యాలు ఇచ్చే.... అదే ఐ వుండాలి. కాని ఇట్లా అనుకుందుకూ సరైన ఆధారం లేదు. ఎందుకంటే తను ప్రస్తుతం జీవిస్తున్న పద్ధతితో విసిగినట్టు, ఒక్క పిసరైనా తెలపలేదు, కొత్తదారులు తొక్కుదామనుకుందుకు.

దాలయ్యకి అది లేచిపోయినందుకు విచార మెయ్యలేదు గాని యింత తెలియ జెప్పకుండా పోవడమేమా? అని విచారంగా వుంది. అంత యిష్టం లేకపోతే తను బలవంతం చేస్తే మాత్రం ఏం సుఖంగా వుంటుంది ఆ కాపరం.

ఏదీ తేలలేదు

చీకటిలో ఏదో మనిషి నాడలా తన వైపు ఒస్తోంది. అదేమో ననుకున్నాడు.

"ఎక్కడికెళ్ళావ్?" అన్నాడు ఆత్రంతో.

వొచ్చే మనిషి కంఠం సవిరించింది. క్రమంగా మొగాడని స్పష్టపడింది.

దాలయ్య నాలికకొరుక్కొని "ఎవరారు?" అన్నాడు

"నేన్రా! నేషిగాడ్ని"

శేషయ్య వొచ్చి పక్కగా బండరాయి మీద కూచున్నాడు.

"ఏం విచారంగా వుందా?" అన్నాడు ఓదార్పుకి.

"అసలు జరిగిందేటి? సరిగ్గా చెప్పు" అన్నాడు దాలయ్య – అంతా తెల్సుకుందామని.

శేషయ్య కొంచెం దగ్గర స్నేహితుడు డబ్బు నిలవున్నవాడు. ఓ సొంత జట్కా ఉంది. దాన్ని తోలుకుని స్వతంత్రంగా బతుకుతున్నాడు.

"పట్నంలో కారు స్టాండ్ దగ్గర కనపడ్డాడు. మన మెకానిక్ లేడూ, అతగాడు పక్కనున్నాడు. నేను ఎక్కడ్నించో బండి తోలుకొస్తున్నాను. ఇక్కడుందేవిటా? అని ఆశ్చర్యమేసింది! కాని ఏమని అడగడానికీ భయమేసింది.

"అక్కడకి అడిగాను 'ఇదేమిటీ?' అని. మెకానిక్ టికట్టు తీసుకుందుకు కారు దగ్గర కెళ్ళాడు.

" 'ఆయనతో పోతున్నాను ఆయనకూడా నన్ను పిలిచాడు. మాకు మనసు కుదిరింది.' ఇక్కడ కొంత సేపు ఆగిమళ్ళీ అందుకుంది. 'వాడంటే ఇష్టం లేదని కాదు; పిచ్చి మనసుండబట్టలేకపోయింది. యిట్లా చేశానని కోప్పడొద్దను. ఎప్పటికీ మరిసిపోనని సెప్పు' అంది.

"ఇది నీకు చెబుదామనే వచ్చాను"

అంతా చెప్పి – దాలయ్య – ఏం పెద్ద షాక్ తింటాడోనని – మొఖం కేసి దీక్షగా చూస్తున్నాడు శేషయ్య.

పక్క గుడిసెల వాళ్ల సద్దుమణిగింది. పక్షులు చెట్లమాటు నుండి రొద జేస్తున్నాయి. కీచురాళ్ల కూతలు కూడా ఎక్కువగానే వున్నాయి. ఏ చెట్టు" లేనిచోట ఆ ముదపుచెట్టే మహా వృక్షమైనట్టు సూర్యుడూ చంద్రుడూ లేని ఆకాశానికి అధివాధుల్లా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

శేషయ్య చెప్పిందంతా దాలయ్య శాంతంగా విన్నాడు. అంతా విని చివరికి ఓ నిట్టూర్పు విడిచాడు. అతనేం మాట్లాడనందుకు ఆశ్చర్యమేసింది శేషయ్యకి.

తన స్త్రీయే ఇట్లా చేస్తేనా? తక్షణం వెళ్ళి దాని ప్రాణమైనా తీసేవాడు, తనైనా చచ్చేవాడు. అంతేకాని దాలయ్య పౌరుషం లేనట్టు ఇదేమిటి?

శేషయ్యకి పాలుపోలేదు.

దాలయ్య ఇంటిచూరు తాటాకు పీకి, పళ్లతో ముక్కల కింద కొరికి అవతల పారేస్తున్నాడు. మళ్ళీ కాసేపు తలగోక్కుంటున్నాడు. లోపల ఏ మాలోచిస్తున్నాడో, ఏ నిర్ణయాలకి వొచ్చాడోగాని, పైకి గంభీరంగా కనపడుతున్నాడు. ఆరాటపడ్డ మనస్సు ధీరోదాత్తంగా శాంతం వహించింది.

"ఏమంటావ్?" అన్నాడు శేషయ్య, వెళ్ళిపోవడానికి లేస్తూ.

దాలయ్య ఆకాశంలో నక్షత్రాల్ని పిచ్చిగా లెక్కబెడుతూ అన్నాడు:

"అనడానికేముంది? ఈ కరువు రోజుల్లో 'గింజలు మిగిలాయి' అంటానంతే!"